సాక్షి ఒడిశా

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,54,964లు వచ్చాయని అధికారులు తెలిపారు.



దొంగలు దొరికారు

పర్లాకిమిడి పరిసరాల్లో చోరీలు చేసిన వారు దొరికారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు.

- 8లో




దానాపై అప్రమత్తం

దానా తుఫాన్‌పై ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం సమీక్షించారు.

- 8లో

దడ పుట్టిస్తున్న దానా



సముద్రంలో తుఫాన్ కల్లోల వాతావరణం



బహుళ ప్రయోజనాల విపత్తు ఆశ్రయ కేంద్రం

- తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధం
- ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
- ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- ప్రభుత్వ సిబ్బంది సెలవులు రద్దు

భువనేశ్వర్: దానా తుఫాన్ రాష్ట్రంలోనే తీరం దాటే అవకాశాలు బలపడుతున్నాయి. వాతావరణ శాఖ తాజా అంచనా ప్రకారం పశ్చిమ బెంగాల్ ఒడిశా మధ్య తుఫాన్ తీరం తాకే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తీరం దాటే సమయంలో రాష్ట్రంపై తీవ్ర ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. పూరీ, సాగర్ ద్వీపం మధ్య లేదా భద్రక్, కేంద్రాపడా మధ్య దానా తుఫాన్ తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

- ఈ నెల 24 అర్ధరాత్రి లేదా 25వ తేదీ వేకువ జామున తుఫాన్ తీరం దాటే అవకాశం ఉంది.
- తుఫాన్ తీవ్రతతో గాలుల వేగం గంటకు 100 నుంచి 110 కిలో మీటర్ల వరకు ఉంటాయి. ఉత్తర ఒడిశాలో దీని అలజడి ఎక్కువగా ఉంటుంది.
- మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, జాజ్‌పూర్, జగత్‌సింగ్‌పూర్, కటక్ ప్రాంతాల్లో అతి భారీ వర్ష సూచన జారీ చేశారు.
- ఈ ఏడు జిల్లాలకు రెడ్ అలర్టు జారీ చేశారు.
- పూరీ, ఖుర్దా, గంజాం, నయాగడ్, అంగుల్, ఢెంకనాల్ ఈ 6 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే సూచనతో ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు.

ప్రాణనష్టం జరగకూడదు

దానా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ప్రాణ నష్టం జరగకూడదని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి సూచించారు. తుఫాన్ తీరం తాకిడి కదలిక సమాచారం ఆధారంగా ప్రత్యేక సహాయ కమిషనరు ఎస్‌ఆర్‌సి, అగ్నిమాపక విభాగం డైరెక్టరు జనరల్, శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ తదితరులతో సోమవారం ఆయన సమీక్షించారు. ప్రజలకు భద్రత కల్పించడం ప్రాథమిక కర్తవ్యంగా పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజల్ని సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించడం అనివార్యమని తెలిపారు. ఆశ్రయ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు ఇతరేతర ఏర్పాట్లు ముందస్తుగా పర్యవేక్షించి ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజల్ని ముందస్తుగా తరలించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఒడిశా విపత్తు నిర్వహణ స్పందన దళం ఒడ్రాఫ్ ఈ కార్యకలాపాల్లో తలమునకలై ఉంది.

సిబ్బంది సెలవులు రద్దు

తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేశారు. జిల్లా కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో సమగ్ర యంత్రాంగం రాత్రింబవళ్లు నిఘా వేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి ముంపు, నిల్వ నీరు తొలగింపు వంటి విపత్తు నిర్వహణ కార్యకలాపాలకు అనుబంధ యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పూరీ, ఖుర్దా, గంజాం, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, బాలాసోర్ జిల్లాలకు భారీ వర్ష సంకేతం ఉన్నట్లు రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనరు డీకే సింఘ్ తెలిపారు. ఈ సంకేతాల దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో కచ్చా ఇండ్లలో ఉంటున్న వారిని సురక్షిత శిబిరాలకు తరలించేందుకు ఆదేశించారు.

800 బహుళ ప్రయోజన ఆశ్రయ కేంద్రాలు

దానా తుఫాన్ ప్రభావిత తీర ప్రాంతాల్లో 800 బహుళ ప్రయోజన ఆశ్రయ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. వీటి పటిష్టత, సౌకర్యాలు వంటి అంశాల్ని సంబంధిత జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించారు.

గర్భిణులకు భద్రత

గర్భిణులకు పూర్తి స్థాయి భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. 2 వారాల్లో ప్రసవం అవకాశం ఉన్న గర్భిణులను స్థానిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించి ఆదుకోనున్నారు.

తుఫాన్‌పై విద్యుత్ శాఖ సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ మంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్: దానా తుఫాన్ తీరం చేరే కొద్దీ తీవ్రమైన అలజడి రేపుతుందని వాతావరణ విశ్లేషకుల అంచనా. ప్రధానంగా గాలులు బలం పుంజుకుని అత్యంత వేగంగా వీస్తాయి. దీని ప్రభావంతో పలు ప్రాంతాల్లో చెట్లు కుప్ప కూలడం, స్తంభాలు ఒరిగిపోవడం వంటి వైపరీత్యాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. తుఫాన్ విద్యుత్ విభాగంపై అధికంగా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ ఆ విభాగం సన్నద్ధతపై సమీక్షించారు. తుఫాన్ సమయంలో దెబ్బ తిన్న విద్యుత్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించేందుకు సరంజామాతో యంత్రాంగం ప్రభావిత ప్రాంతాల పరిసరాల్లో సిద్ధమై ఉన్నట్లు సమీక్ష సమావేశంలో విద్యుత్ విభాగం అధికారులు వివరించారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ మధ్య దానా తుఫాన్ తీవ్రత అత్యధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఆకస్మిక ప్రమాదాలు, సత్వర పునరుద్ధరణ కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంటుందని సమావేశానికి హాజరైన ఉన్నతాధికారులు తెలిపారు. విద్యుత్ విభాగం ప్రముఖ కార్యదర్శి, టీపీసీఓడీఎల్ డైరెక్టరు, ప్రముఖ కార్య నిర్వహణ అధికారి సీఈఓ, చీఫ్ ఆపరేషన్స్ అధికారి వంటి ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు భద్రత, రక్షణ కల్పించడం ప్రధాన లక్ష్యంగా సన్నద్ధత కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

వంట సహాయకుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశమైన వంట సహాయకులు

జయపురం: తమ సమస్యలను పరిష్కరించాలని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట సహాయకులు కోరారు. ఈ మేరకు సమావేశం సోమవారం స్థానిక కార్మిక భవనంలో సుస్మిత ఖతి అధ్యక్షతన సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ)అనుబంధ సంఘమైన నిఖిల ఒడిశా వంట సహాయక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 25వ తేదీన జరగనున్న రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సుస్మిత పిలుపునిచ్చారు. రాష్ట్ర సమావేశానికి ముందు జిల్లాలో అన్ని సమితిలలో కమిటీలు ఏర్పాటు చేసి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఆమె వెల్లడించారు. వంట సహాయకులను కార్మికులుగా గుర్తించాలని, రిటైర్ అయిన తరువాత పింఛన్ రూ. ఐదు వేలు ఇవ్వాలని, గృహ సౌకర్యం కల్పించాలని, పిల్లలకు విద్య, కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో జమున ఖిలో, సుక్రీ సిందియ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బియ్యం లోడ్‌తో లారీ బోల్తా



రోడ్డుపై చెల్లాచెదురైన బియ్యం బస్తాలు

రాయగడ: జిల్లాలోని అంబోదల సమీపంలో ఉన్న మంజూరికుప్ప గ్రామం వద్ద సోమవారం ఉదయం బియ్యం లోడ్‌తో వెళ్తున్న ఒక లారీ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ లారీ రాయపూర్ నుంచి విశాఖపట్నం వెళ్తోంది. లారీ బోల్తాపడడంతో రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగింది.

75 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: పద్మాగిరి పంచాయతీ తండపల్లి గ్రామ అడవిలో గంజాయిని అక్రమంగా తరలించేందుకు ప్యాకింగ్ జరుగుతుందని సమాచారం రావడంతో ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో తండపల్లి వద్ద మాటువేసి స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో దాదాపు 8 మంది ప్యాకింగ్ చేస్తుండగా పోలీసుల రాకను గమనించి పరారయ్యారు. కాగా వారిలో ఒకడు పోలీసులకు చిక్కాడు. మొత్తం 75 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం



దామని మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి నాయక్ గూడ పంచాయతీ తంగూడ గ్రామం వద్ద సోమవారం ఉదయం మత్తిలి సమితి అధ్యక్షుడు మహేష్ బక్క, ఆయన బావ లచం బక్కలు చెరువు వైపునకు వెళ్లారు. ఆ సమయంలో వారికి చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు. ఆమె మత్తిలి సమితి టేమురుపల్లి పంచాయతీ దురుమాగూడ గ్రామానికి చెందిన తూస్సీరామ్ మదిర భర్య దామిని మదిరా(50)గా గుర్తించారు. ఇటీవల ఆమె దురదృష్టావశాత్తు చెరువులో మునిగిపోయి గల్లంతయ్యింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

స్థానిక ఉద్యోగాలు స్థానిక యువతకే ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు

జయపురం: స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న డిమాండ్‌తో అవిభక్త కొరాపుట్‌లో వివిధ సంఘాలు చేపట్టిన ఆందోళనకు కొట్‌పాడ్ సమితి సర్పంచ్ సంఘం మద్దతు ప్రకటించింది. కొట్‌పాడ్ సమితి దమణహండిలో సోమవారం సర్పంచ్ సంఘం త్రైమాసిక సమావేశం జరిగింది. రాష్ట్ర స్థాయిలో ఉద్యోగాలు నియమించడం వల్ల కొరాపుట్ జిల్లాలోని విద్యావంతులు ఉద్యగాలు పొందలేకపోతున్నారని, జిల్లాలో గల ఉద్యోగాలు జిల్లా పరిధిలోని వారికే ఇవ్వాలనే డిమాండ్‌ను సమావేశంలో సమర్థించారు. అలాగే ప్రభుత్వం సమకూర్చుతున్న బియ్యం, చోళ్లు, కిరోసిన్, గోధుమలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్న అంశంపై కూడా చర్చించారు. సమితి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా కార్యనుష్టాన కమిటీ సలహాదారు లచమణ పూజారి సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సుధీర్ చంద్ర మహంతి, ఉపాధ్యక్షుడు పరశురాం సమరథ్, సలహాదారు బపూన్ త్రిపాఠీ, నీలకంఠ పూజారి, జిల్లా పరిషత్ సభ్యులు త్రివతి చలాన్, బాలకృష్ణ మఝి, రామకృష్ణ పూజారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ఏకరువు



సంయుక్త సమావేశంలో ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ తదితరులు

జయపురం: స్థానిక పారాబెడ సంతోషిమా నగర్ ప్రజల సమస్యలపై సోమవారం అధికారులు, ఎమ్మెల్యేలతో సంతోషిమా నగర్ అభివృద్ధి కమిటీ సమావేశమైంది. స్థానికంగా దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని వారు అధికారులకు తెలియజేశారు. తమ కమిటీ సొంత ఖర్చుతో సెక్యూరిటీ గార్డును నియమించిందని, అయినా రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, సబ్ కలెక్టర్ అక్కవరమ్ శోశ్యా రెడ్డి, సబ్‌డివిజనల్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, కమిటీ సభ్యులు ప్రకాశ్ మిశ్రా, శివరాం త్రిపాఠి, రామనాథ్ సాహు, అజయ్ మిశ్రా, నయన కిశోర్ మహంతి, సుభాష్ చంద్ర మిశ్ర పాల్గొన్నారు.

పూరీ యాత్రికులకు విజ్ఞప్తి

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని దర్శనం, శ్రీ క్షేత్రం సందర్శనకు విచ్చేసిన యాత్రికులు త్వరగా స్వస్థలాలకు పయనం కావాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దానా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త కార్యాచరణలో భాగంగా ఈ మేరకు విజ్ఞప్తి చేయడం విశేషం. తుఫాన్ తీరం దాటక ముందే వీరంతా బయల్దేరాలని అభ్యర్థించారు. మంగళవారం నాటికి పూరీ చేరిన బయట ప్రాంతాల యాత్రికులు ఇళ్లకు బయల్దేరాలని కోరారు.

• చిలికాలో చిక్కుకున్న పడవ



చిలికా సరసు నడి బొడ్డున ప్రయాణికుల రవాణా పడవ చిక్కుకుంది. పూరీ జిల్లా కృష్ణ ప్రసాద్ తీరం సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సత్తాపాడా నుంచి జొహ్నకుదా వెళ్తుండగా సరసు మార్గంలో సుమారు గంటన్నర సేపు ఇలా స్తంభించి పోయింది. దీనిలో 60 మంది పైబడి ప్రయాణికులు, 40 పైబడి వాహనాలు ఉన్నాయి.

–భువనేశ్వర్

బస్సు బోల్తా



బోల్తాపడిన బస్సు



లిల్లిగుడ కెందుఘాటీ వద్ద బోల్తాపడిన మహాకాళ్ ప్రైవేటు బస్సు

- 20 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- ఒకేచోట మూడు వాహనాలు ఢీ
- గజపతి జిల్లా కెందుఘాటి సమీపంలో ఘటన

పర్లాకిమిడి: ప్రైవేటు బస్సు బోల్తాపడిన ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఒకేచోట మూడు వాహనాలు ఢీకొట్టుకున్న ఈ ఘోర ప్రమాదం గజపతి జిల్లా మోహానా బ్లాక్ లిల్లిగుడ సమీపంలోని కెందుఘాటి వద్ద ఆదివారం అర్ధరాత్రి సుమారు 1.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన వారిని బరంపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై మోహానా పోలీసు అధికారులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. జగన్నాథ ఎక్స్‌ప్రెస్ ప్రైవేటు బస్సు పూరీ నుంచి మల్కన్‌గిరికి మోహానా మీదుగా ప్రయాణిస్తుండగా మంచుకారణంగా డ్రైవర్‌కు రోడ్డు సక్రమంగా కనిపించకపోవడంతో అదుపు ఒరిగిపోయింది. అదే సమయంలో ఓ పికప్ వ్యాన్ జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సును వెనుక పక్కన ఆపారు. ఇంతలో అదే సమయానికి భువనేశ్వర్ నుంచి మల్కనగిరి వెళ్తున్న ప్రైవేటు బస్సు మహా కాళేశ్వర్ ఆగిఉన్న పికప్ వ్యాన్‌ను బలంగా గుద్దింది. దీంతో కాళేశ్వర్ బస్సు ఘాట్ రోడ్డు పక్కన బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. వీరందరినీ మోహానా పబ్లిక్ హెల్త్ కేంద్రంలో చేర్పించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన సస్మితా సాహు, స్వాతీష్ సాహు (30), స్వతీష్ పట్నాయక్ (26), హాలధర్ శెఠి (50), సాయికుమార్ దాస్(30)లను బరంపురం మెడికల్‌కు తరలించి చికిత్స చేస్తున్నారు. మోహానా పోలీసు అధికారి బసంత్ శెఠి, అగ్నిమాపక దళం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బస్సులు, పికప్ వ్యాన్ స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు.

వైభవంగా కళా ఉత్సవాలు



అలరించిన నృత్యాలు

రాయగడ: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మండల స్థాయి కళా ఉత్సవ్-24ను వైభవంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్ చిన్మయి మహానంద మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న కళను బయటకు తీసేందుకు ఇటువంటి తరహా ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లోనూ ఆసక్తి కనబర్చాలని సూచించారు. విద్యాలయం ప్రధానాచార్యులు ఆచార్య రాజారామం మాట్లాడుతూ విద్యార్థుల్లో కళలను, వారిలో ఉన్న అభిరుచిని వెలికితీసేందుకు కళా ఉత్సవ్ పేరిట బృంద గానం, నృత్యం, ఆర్ట్ ప్రదర్శన వంటి పోటీలను నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని గుణుపూర్, రాయగడ, గజపతి, సునాబెడ, కొరాపుట్, నవరంగపూర్, మల్కన్‌గరి ప్రాంతాల్లోని కేంద్రీయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలిపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

అబ్బురపరిచిన కళాకృతులు

ఈ పోటీల్లో భాగంగా పలువురు విద్యార్థులు చిత్తు కాగితాలతో రూపొందించిన కళాకృతులు అందరినీ ఆకర్షించాయి, అదేవిధంగా చిత్తు కాగితాలతో రూపొందించిన వీణ అందరిని అబ్బురపరిచింది. వివిధ భాషలతో బృందగానాలు అందరినీ మైమరపించాయి. నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాలయం సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ రమేష్ సాహు తదితరులు పాల్గొన్నారు.



కాగితాలతో రూపొందించిన వీణ



కాగితాలతో రూపొందించిన కళాకృతులు



బృందగానం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

రాయగడ: ఒడియా ప్రజల కార్తీక మాసం ప్రారంభం కావడంతో మొదటి సోమవారం పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుని దర్శనం కోసం భక్తులు బారులుతీరారు.

పోర్టు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాం



మూలపేట పోర్టు పనులను పునః ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: మూలపేట పోర్టును త్వరగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మూలపేట పోర్టు పనులను మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 194 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న ఈ రాష్ట్రంలో ప్రతి 60 కిలోమీటర్లకు ఒక షిప్పింగ్ హార్బర్ గానీ ఫిషింగ్ ల్యాండ్‌గాని ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2025 జూన్ 12 కల్లా మొదటి బెర్త్ పూర్తి చేసి మొదటి షిప్ ల్యాండ్ చేసే దిశగా పనిచేయాలని సూచించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్ట్‌కు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. భోగాపురం నుంచి మూలపేట పోర్టు వరకు ఆరులైన్లు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన లిక్కర్ పాలసీ ద్వారా ప్రభుత్వానికి రూ.1900 కోట్లు ఆదాయం వచ్చిందని, అలాగే మద్యం అమ్మకాల్లో ఆరు రోజుల్లో రూ.600 కోట్లు వచ్చిందని చెప్పారు. ట్రాక్టర్లు, బండ్ల ద్వారా నది దగ్గరకు వెళ్లి ఇసుక తీసుకోవచ్చని, దీనిపై అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతకుముందు పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయనతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాసలో ఇద్దరు బాలికలపై అత్యాచారం చేసిన సంఘటనలో ముగ్గురిపై కాశీబుగ్గ సీఐ మోహనరావు సోమవారం కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి మాట్లాడుతూ.. తన భర్త చనిపోయాడని, టీ దుకాణం పెట్టుకుని బతుకుతున్నామని తెలిపారు. శనివారం ఓ 19 ఏళ్ల యువకుడు వచ్చి తన చిన్న కుమార్తెను పుట్టిన రోజు వేడుకలకు పిలిచాడని, తాను నిరాకరించడంతో తాను లేని సమయంలో వచ్చి ఇద్దరు కూతుళ్లను ఇంటి వద్ద నుంచి కారులో తీసుకుని వెళ్లాడని చెప్పారు. మద్యం కలిపిన కూల్‌డ్రింక్స్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిద్దరికీ స్పృహ లేని పరిస్థితుల్లో ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయారని తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడాలని కోరారు.

వంతెన సమీపంలోనే ఇసుక తవ్వకాలు

నరసన్నపేట: ఇసుక ఉచితంగా తీసుకువెళ్లేందుకు ట్రాక్టర్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ తవ్వకాలు చేస్తున్నారు. మడపాం, బుచ్చిపేట, చేనులవలస, లుకలాం, ఉప్పరిపేటల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అలాగే మడపాం వంశధార నదిపై నిర్మించిన వంతెన సమీపంలోనే ఇసుక తవ్వి తీసుకెళ్తున్నారు. వంతెనకు వంద మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు చేయకూడదు. కానీ ఈ నిబంధనను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇది ఇలాగే కొనసాగితే వంతెనకు ప్రమాదం ముంచుకువస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వలంటీర్ల ఆందోళన



పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నాలో వలంటీర్లు

కాశీబుగ్గ: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరుతూ పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద వలంటీర్లు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ మాట్లాడుతూ తమకు బకాయి పడిన నాలుగు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలని కోరారు. రాజీనామా చేసిన వలంటీర్లను బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం ఏఓ ప్రకాశరావుకి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు.

దానా తుఫాన్‌పై అప్రమత్తం

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి
- ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చర్యలు
- రేపు రాష్ట్రానికి చేరనున్న హెలికాప్టర్లు



అధికారులతో తుఫాన్‌పై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: దానా తుఫాన్ కదలిక తాజా స్థితిగతులు, విపత్తు నిర్వహణ సన్నద్ధత కార్యకలాపాల్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సమీక్షించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ఆయన అధ్యక్షతన సోమవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనరు అనూ గర్గ్, ప్రత్యేక సహాయ కమిషనర్, వ్యవసాయం, విద్యుత్ శాఖ ప్రముఖ కార్యదర్శులు, సీనియర్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. దానా తుఫాన్ ఒడిశాలో తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో దీనిపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. రాష్ట్ర సంపదను పరిరక్షించడంతోపాటు ప్రాణనష్టం లేకుండా చూస్తామన్నారు. పూర్తి స్థాయి భద్రత, రక్షణ కార్యాచరణతో ప్రభుత్వం సన్నద్ధమైందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనలకు కావద్దన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాలుపంచుకున్నారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రత్యేక సహాయ కమిషనర్ ఎస్ఆర్‌సీ కార్యాలయంలో రాత్రింబవళ్లు పని చేసే 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు అవుతుంది. తుఫాన్ కదలికను ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్లు అప్రమత్తంగా ఉంటు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించడం, రాకపోకలు, విద్యుత్ సరఫరా, ఆహారం, మంచినీరు, ఆరోగ్య సేవలు, సహాయ సామగ్రి పంపిణీ, బ్లాక్ మార్కెటు నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు

ప్రభుత్వం ప్రజల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తుంది. ప్రతి ఒక్కరి ప్రాణాల్ని కాపాడడం ధ్యేయంగా విపత్తు నిర్వహణ కార్యాచరణతో యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. తుఫాన్ వైపరీత్యంతో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలు చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆపత్కాలంలో ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు.

మత్స్యకారులను తీరానికి చేర్చాలి

దానా తుఫాన్‌తీరానికి చేరువ అవుతున్న తరుణంలో ప్రమాదం అంచుల్లో మత్స్యకారులు కొట్టుమిట్టాడుతున్నారు. చేపల వేట కోసం వెళ్లిన మత్స్యకారుల్లో కొంత మంది ఇప్పటి వరకు తీరం చేరలేదు. వీరి పట్ల ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. త్వరగా వీరందర్ని తీరం చేర్చాలని అధికారులకు ఆదేశించారు. నడి సముద్రంలో 11 మంది మత్స్యకారులు చేపల పడవలతో చిక్కుకున్నారు. వీరిలో తొమ్మిది పడవలు జగత్‌సింగ్‌పూర్, రెండు పడవలు సముద్రం నడి బొడ్డున కొట్టుమిట్టాడుతున్నాయి.

కేంద్రం చేయూత

తుఫాన్ కారణంగా నష్టం వాటిల్లితే తదనంతర కార్యకలాపాల కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందజేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. సహాయ, పునరుద్ధరణ కార్యకలాపాల కోసం కేంద్ర ప్రభుత్వం హెలికాప్టర్లు అందజేస్తుందని చెప్పారు. ఈ నెల 23వ తేదీలోగా హెలికాప్టర్లు రాష్ట్రానికి చేరుతాయన్నారు.

గ్రామాలకు పోలీసుల భద్రత

తుఫాన్ విపత్తు నిర్వహణ కార్యాచరణలో భాగంగా లోతట్టు, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల్ని ముందస్తుగా విపత్తు ఆశ్రయ శిబిరాలకు తరలించనున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలు నిర్మానుష్యమై ఖాళీ కానున్నాయి. ఈ నేపథ్యంలో దొంగతనాలు వంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రాష్ట్ర పోలీసులు గ్రామాలకు భద్రత కల్పిస్తారని మంత్రి అభయం ఇచ్చారు.

దొంగలు దొరికారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజపతి ఎస్పీ జితేంద్రనాథ్ పండా.

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్, సెంచూరియన్ వర్సిటీ పాటికోట గ్రామం వద్ద దొంగతనాల కేసులను గజపతి పోలీసుల బృందం ఛేదించి నలుగురిని పట్టుకుంది. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. రాణిపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎస్పీ జితేంద్రనాథ్ పండా విలేకరులతో మాట్లాడారు. కాశీనగర్, ఆర్.సీతాపురం దోపిడీ కేసుల్లో నలుగురిని సీసీ ఫుటేజీల్లో గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,60,000 నగదు, 157.7 గ్రాముల బంగారం, 0.729 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక అపాచీ టీవీఎస్ బైక్, టీవీఎస్ ఎక్సెల్, రెండు మొబైళ్లు, ఇనుప రాడ్లు, ఆయుధాలు స్వాధీనం చేసుకన్నారు. వీరిని ప్రతాప్ జన్ని, దేవరాజ్ మఝి, సరస్వతీ జన్నీ, గౌరీ జన్నిగా గుర్తించారు. వీరంతా పపడాహాండి, నవరంగ్‌పూర్ జిల్లాలకు చెందిన వారని ఎస్పీ జితేంద్రనాథ్ పండా తెలియజేశారు. వీరు పర్లాకిమిడిలో ఇల్లు అద్దెకు తీసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. హడ్డుబంగిలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ అక్టోబరు 21న దొరికిపోయారని ఎస్పీ తెలిపారు. ఈ ముఠానే రాయగడ, భవానీ పాట్నలో దొంగతనాలకు పాల్పడిందని చెప్పారు. సమావేశంలో డీఎస్పీ సునీల్ మహంతి, ఎస్‌డీపీఓ మాధవానంద నాయక్, గురండి ఐఐసీ రవీంద్ర పాత్రో ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు, నగదు

అమ్మా.. ఆశీర్వదించు



హబిష్యాలీ పాదాలకు మొక్కుతున్న సీఎం



వర్ధిల్లు నాయనా ....హబిషాలీ ఆశీర్వాదం

భువనేశ్వర్: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల వ్రతం కోసం పలు ప్రాంతాల నుంచి హబిష్యాలీలు పూరీ విచ్చేశారు. సుమారు 3 వేల మంది హబిష్యాలీల కోసం ఉచిత వసతి, దర్శనం, మహా ప్రసాదం, ఆరోగ్య సేవలు తదితర సౌకర్యాల్ని ప్రభుత్వం కల్పించింది. వీరందరితో ప్రత్యక్షంగా భేటీ అయ్యేందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పూరీ సందర్శించారు. వ్రత దీక్షలో ఉన్న పెద్దల పాదాలకు వందనం చేసి ఆశీర్వాదం పొందారు.

కార్తీక వ్రతం పురస్కరించుకుని అవసరమైన అన్ని సౌకర్యాలు వీరికి నిరవధికంగా అందేలా జాగ్రత్త వహించాలని పూరీ జిల్లా అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి ఆదేశించారు.



ముఖ్యమంత్రి సభలో హబిషాలీలు

ఇద్దరు బాలల దత్తత



ఇద్దరు బాలలను అప్పగిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా సంతాన దత్తత కేంద్రం నుంచి ఇద్దరు బాలలను కెనడా దేశ దంపతులకు సోమవారం కలెక్టర్ బిజయ కుమార్ దాస్ కార్యాలయంలో దత్తత నిమిత్తం అందజేశారు. కెనడా దేశస్తులు జాతీయ సంతాన దత్తత కేంద్రం పోర్టల్‌లో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో నిబంధనలు పరీక్షించారు. ఒడిశాషాలోని గుమ్మా అనాథ దత్తత పునరావాస కేంద్రం నుంచి బాలలను తీసుకువచ్చి కెనడా దేశస్తులకు అప్పగించారు. ఈ రోజు అప్పగించిన ఇద్దరు అనాథ బాలలతో జిల్లా నుంచి ఇప్పటివరకు 58 మందిని దత్తతగా అప్పగించినట్టు జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలియజేశారు. అప్పగింతల సమయంలో ఏడీఎం రాజేంద్రమింజ్, దత్తత కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

కరువు భత్యం పెంపు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పెంచినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ప్రకటించారు. కరువు భత్యం 50 నుంచి 53 శాతానికి పెరిగింది. ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి ఈ పెంపు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. బకాయితో సహా ఈ నెలలో ఈ లబ్ధి పొందుతారని తెలిపారు. ఈ పెంపు ప్రభుత్వ పింఛన్‌దారులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ లెక్కన రాష్ట్రంలో లక్షా 50 వేల మంది ఉద్యోగులు, పింఛన్‌దారులు లబ్ధి పొందుతారన్నారు.

అప్రమత్తం..



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల ఈ నెల 23, 24, 25వ తేదీల్లో గజపతి జిల్లాకు తుపాన్ ముప్పు ఉందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. గజపతి జిల్లాకు ఎల్లో వార్నింగ్ జారీ చేయడంతో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ కలెక్టరేట్‌లో సోమవారం వివిధ ప్రభుత్వ శాఖల ముఖ్య అధికారులతో సమావేశమయ్యారు. భువనేశ్వర్‌లో ఐఎండీ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల పర్యవేక్షణ కేంద్రం, బీడీఓలు, తహసీల్దార్లు 24 గంటలూ మండలాల్లో ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అధికారులకు సెలవులను రద్దుచేశారు. జిల్లాలోని ఆర్.ఉదయగిరి, నువాగడ, రామగిరి, జిరంగో ప్రాంతాల్లో కొండలపై నివసిస్తున్న ఆదివాసీలను ఖాళీ చేయించారు.

పాఠశాలలు, పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ జితేంద్రనాథ్ పండా, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, ఐటీడీఏ అధికారి దిలీప్ కుమార్ బెహరా, బ్లాక్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెండ్స్ గ్రూప్ వార్షికోత్సవం



ఫ్రెండ్స్ గ్రూప్ ప్రతినిధులతో ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: స్థానిక కరణం వీధిలోని నృసింహనాథ్ కల్యాణ మండపంలో ఫ్రెండ్స్ గ్రూప్ (వుయ్ ఆల్ వన్) పదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేశారు. ఎమ్మెల్యే రూపేష్ మాట్లాడుతూ ఫ్రెండ్స్ గ్రూప్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలు గజపతి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ గ్రూప్ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమానికి వ్యాపారి జామి పోలిశెట్టి అధ్యక్షులుగా వ్యవహరించారు. వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కోట్ని శోభారాణి, హైడిశెట్టి మురళి, నగేష్, పెద్దిని కృష్ణ, జామి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- పోలీస్ సంస్మరణ దినోత్సవంలో అధికారులు
- సేవలను స్మరించుకున్న సిబ్బంది



రాయగడ: పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివమని పోలీసు అధికారులు అన్నారు. వారి త్యాగాలను నిత్యం గుర్తు చేసుకోవాలన్నారు. 65వ పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పుష్పగుచ్ఛాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని డీపీవో పరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విధినిర్వహనలో అమరులైన పోలీసులు నివాళులర్పించారు. జిల్లాలోని ఏడు సమితుల పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



రాయగడ: అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఎస్పీ స్వాతి

రాయగడలో..

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ సమీపంలోని రిజర్వు పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో పోలీసులు చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను సత్కారించారు. జిల్లాలో అన్ని సమితుల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక బెత్తగుడ మూడో బెటాలియన్ పోలీస్ గ్రౌండ్స్‌లో సోమవారం పోలీసుల అమరవీరుల సాహిద్ దివాస్‌ను నిర్వహించారు. ఎస్పీ జితేంద్రనాథ్ పండా ముఖ్య అతిథిగా విచ్చేశారు. విధి నిర్వాహణలో మరణించిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. పోలీసు సాహిద్ స్మృతి పీఠం వద్ద ఎస్పీ పండా సెల్యూట్ చేశారు. పోలీసు ప్యారెడ్ జరిపి సాహిద్ పోలీసులకు గౌరవవందనం తెలిపారు. విధి నిర్వాహణలో ప్రాణాలు విడిచిన వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ సత్కరించారు. డీఎస్పీ సునీల్ మహంతి, ఆదర్శ పోలీసు స్టేషన్ ఎస్‌డీపీఓ మాధవానంద నాయక్, ఐఐసీ ప్రశాంత్ భూపతి తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: అమరులైన జవాన్లక నివాళులర్పిస్తున్న ఎస్పీ, ఇతర పోలీసు సిబ్బంది



పర్లాకిమిడి: మాట్లాడుతున్న ఎస్పీ జితేంద్రనాథ్ పండా



మల్కన్‌గిరి: సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్ వర్మ

క్లుప్తంగా

రెండు ఆలయాల్లో చోరీ

శృంగవరపుకోట: మండలంలోని గౌరాజు కళ్లాల వద్ద ఉన్న రెండు దేవాలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లో వెండి వస్తువులతో పాటు హుండీలను ఎత్తుకుపోయారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఎస్సై గంగరాజు ఆలయ ప్రాంగణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారని, పైడితల్లమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో చోరీలు జరిగాయని తెలిపారు. ఈ చోరీల్లో సుమారు రూ.30వేల నగదు, రెండు ఆలయాల్లో వెండి వస్తువులు పోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ సభ్యులు వచ్చి రెండు ఆలయాల్లో వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఎస్సై గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


పార్కు చెరువు వద్ద గుర్తు తెలియని మృతదేహం

బొబ్బిలి: పట్టణంలోని రాణిమల్లమ్మ దేవి మున్సిపల్ పార్క్ వద్ద నున్న చెరువు గట్టుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. సోమవారం చెరువుగట్టుపై నుంచి వెళ్తున్న కొంతమంది మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆ వ్యక్తి చిరునామాకోసం పోలీసులు వచ్చి ప్రయత్నించారు. అనారోగ్య కారణాలతో ఆస్పత్రికి వెళ్లి మందులు తీసుకుని వస్తుండగా చెరువుగట్టుపైనుంచి జారిపడిపోయి అనంతరం గుండెపోటుతో మరణించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలుంటాయని, అతని వద్ద కొన్ని రకాల మందులు ఉన్నాయని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సతీష్ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కడుపునొప్పితో నాలుగేళ్ల బాలిక మృతి


మృతిచెందిన బాలిక దీన

గంట్యాడ: మండలంలోని ఎగువకొండపర్తి మధుర గ్రామం పెదపాడుకు చెందిన బాలిక ఎర్రబోయిన దీన (4) కడుపు నొప్పితో మృతి చెందింది. నాలుగురోజులుగా కడుపు నొప్పి, ఆయాసంతో బాలిక బాధపడుతోంది. తల్లిదండ్రులు పెదపాడు గ్రామం సమీపంలో పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం కడపునొప్పి ఎక్కువ కావడంతో పోడు వ్యవసాయం చేస్తున్న ప్రాంతం నుంచి పెదపాడు చేరుకుని ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు బావురుమన్నారు. ప్రస్తుతం ఆ బాలిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతోంది.

ప్రజా వినతుల పరిష్కార వేదికకు 180 వినతులు


వినతులను స్వీకరిస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఎక్కువగా రెవెన్యూ కు చెందిన వినతులే వస్తున్నాయని, తహసీల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సోమవారం ప్రజా వినతులు పరిష్కార వేదికలో భాగంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత ప్రజలనుంచి 180 వినతులు స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 42 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ప్రజల నుంచి 42 ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

రోడ్డెక్కిన అన్నదాత

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు సాగునీటి కోసం పాలకొండలోని నీటిపారుదల శాఖ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఆధ్వర్యంలో రైతులు నీటిపారుదల శాఖ అధికారులను ప్రశ్నించారు. ఈ ఏడాది వరి పంటకు చివరి దశలో సాగునీరు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువల్లో పూడికలు తీయక పోవడంతో ఆయకట్టుకు నీరు అందడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెన్ను వస్తున్న దశలో వర్షాలు లేక పంట ఎండి పోతోందని వాపోయారు. వెలగవాడ, రుద్రిపేట, సింగన్నవలస, పరశురాంపురం గ్రామాల పరిధి రైతులు ఈ ఆందోళనలో పాల్గొనగా సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, సభ్యులు మద్దతు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- జేసీ ఎస్ఎస్ శోభిక


వినతిని అందజేసేందుకు వచ్చిన పి.శేషగిరి


వినతులను అందజేసేందుకు క్యూలో ఉన్న అర్జీదారులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న డీడీ, పీహెచ్‌వోలు

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి వినతులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అధికారులను ఆదేశించారు. జేసీ శోభిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 146 వినతులను జేసీ శోభిక, డీఆర్ఓ జి.కేశవనాయుడు స్వీకరించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాటరీ వాహనం మంజూరు చేయాలని వినతి

బలిజిపేట మండలం అరసాడ గ్రామానికిచెందిన పి. శేషగిరి తనకు బ్యాటరీ వాహనం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశాడు. గత ఏడాది డిసెంబర్‌లో బ్యాటరీ మూడు చక్రాల వాహనం తనకు మంజూరైందని అధికారులు తెలిపినప్పటికీ ఇంతవరకు అందజేయలేదని, పూర్తిగా రెండు కాళ్లు లేకపోవడంతో రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నానంటూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశాడు. శేషగిరి ఈ కార్యక్రమానికి ఆటోలో వ్యక్తిగత సహాయకుడితో కలిసి హాజరయ్యాడు.

పలువురికి వినికిడి పరికరాల అందజేత

వినికిడి లోపం ఉన్న పలువురికి వినికిడి యంత్రాలను జేసీ శోభిక అందజేశారు. కార్యక్రమంలో జేసీ చేతుల మీదుగా పార్వతీపురం మండలంలోని కలవరిపేటకు చెందిన బొడ్లమాని ప్రసాదరావు, పాలకొండ మండలం గోపాలపురానికి చెందిన కలివరపు నందీశ్వరరావు, వీరఘట్టం మండలం సంతకవిటికి చెందిన కొత్తవలస రమణమ్మలు వినికిడి యంత్రాలు అందుకున్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 2 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సూచించారు. ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఫిర్యాదులు గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయనున్నట్లు కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ జీడీ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 87 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 87 వినతులు వచ్చాయి. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, పీహెచ్‌వో గణేష్‌లు పబ్లిక్ గ్రీవెన్స్‌ను నిర్వహించారు. బీటీ రోడ్డు మంజూరు చేయాలని జొనగ బుడ్డడుగూడ గ్రామస్తులు కోరగా తమ సమస్య పరిష్కరించాలని పలువురు ఏఎన్ఎంలు వినతిపత్రం అందజేశారు. మినీగోకులం మంజూరు చేయాలని పెద్దరాజపురానికి చెందిన తోటయ్య, ఆయిల్ ఇంజిన్ ఇప్పించాలని కొత్తబర్నకు చెందిన వెంకటరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

భంజ్‌దేవ్‌పై గిరిజనుల ఫిర్యాదు

- పాచిపెంట మండలంలో అనధికారికంగా చేపల చెరువు నిర్వహణ


భంజ్‌దేవ్ ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్..అతని కుటుంబసభ్యులు పాచిపెంట మండలంలో ప్రభుత్వ, దేవస్థానం భూములను ఆక్రమించడమే కాక..అక్కడే అనధికారికంగా చేపల చెరువులు నిర్వహిస్తున్నారని పలువురు గిరిజనులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేత కావడంతో ఏ ఒక్కరూ తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని..ఆ భూములను స్వాధీనం చేసుకుని తమకు జీవనాధారం కోసం అప్పగించాలని కోరారు.

గతంలోనూ పలుమార్లు ఫిర్యాదులు

పాచిపెంట మండలం విశ్వనాథపురం రెవెన్యూ సర్వే నంబరు 12/1లో 13.30 సెంట్లు, 12/2లో 4.56 సెంట్లు, 14/1, 14/2, 29/2, 29/5, 29/7, 81/1బీ, పణుకు వలస రెవెన్యూ సర్వే నంబర్ 451/2, 452/2లో 3.52 సెంట్ల ప్రభుత్వ, దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, అతని కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్నట్లు 2018వ సంవత్సరం నుంచి అప్పటి పార్వతీపురం ఆర్డీవో, విజయనగరం కలెక్టర్‌లకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. నిర్ధారణ కోసం వివిధ శాఖల అధికారులతో ఒక కమిటీ కూడా వేశారు. ఈ వివాదం న్యాయస్థానం వరకూ వెళ్లింది.

చెరువు ఖాళీ చేయాలని ఆదేశాలు

విశ్వనాథపురం గ్రామంలో కేవలం చెరువు తవ్వడానికే ప్రొవిజినల్ అనుమతి పొంది.. దేవదాయ శాఖ భూమి సర్వే నంబరు 14/1లో 2.80 ఎకరాలు, 12/1లో 6.80 ఎకరాలను భంజ్‌దేవ్, అతని కుటుంబ సభ్యులు ఆక్రమించి చేపల సాగు చేస్తున్నట్లు గతంలోనే మత్స్యశాఖ అధికారులు నిర్ధారించారు. ఈ విషయంలో హైకోర్టు కూడా జోక్యం చేసుకోవడంతో సదరు భూమికి భంజ్‌దేవ్ చట్టపరమైన హక్కుదారులు కారని అధికారులు స్పష్టం చేశారు. 15 రోజుల్లోగా ఆ స్థలాన్ని ఖాళీ చేసి పాచిపెంట తహసీల్దార్‌కు అప్పగించాలని ఈ ఏడాది జనవరిలో హైకోర్టు ఆదేశించినట్లు గడిచిన జూలై నెలలో జరిగిన జిల్లా స్థాయి మత్స్యశాఖ కమిటీ సమావేశంలో స్వయంగా అధికారులు వెల్లడించారు. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఆ ఆదేశాలు అమలు కావడం లేదని.. ఇంకా ఆ భూములు భంజ్‌దేవ్ కుటుంబ సభ్యుల ఆక్రమణలోనే ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ వికాస్ పరిషత్ అధ్యక్షుడు చెల్లూరు జోగయ్య, గిరిజనులు మంచాల గంగరాజు, బంగారమ్మ, మర్రి గంగమ్మ తదితరులు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు..చేపల చెరువులకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని సమాధానమిచ్చారు.

వెనుకనుంచి నడిపిస్తున్న సొంత పార్టీ ముఖ్యనేత?

భంజ్‌దేవ్ ఆక్రమణల వ్యవహారాన్ని సొంత పార్టీకే చెందిన ముఖ్య నేత రచ్చకెక్కిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పటినుంచో భంజ్‌దేవ్‌తో ఆ నేతకు పొసగడం లేదని..ఇప్పుడు ఈ వ్యవహారాన్ని తెలివిగా వీధిన పెట్టి, పార్టీ అధినేత వద్ద నిలబెట్టాలని యోచిస్తున్నట్లు టీడీపీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

'108' ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలి

- కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం డిమాండ్


నజీర్ హుస్సేన్‌కు వినతి పత్రం ఇస్తున్న 108 ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు గడిచిన రెండు నెలలు బకాయి జీతాలు తక్షణమే విడుదల చేయాలని 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు 108 సంస్థ జోనల్ మేనేజర్ నజీర్ హుస్సేన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ (ఏఈఎంఎస్) సంస్థ 108 నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఉద్యోగులకు జీతాల చెల్లింపులో జాప్యం చేస్తోందని ఆరోపించారు. సకాలంలో జీతాలు రాక పోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన జీతాలు తక్షణమే చెల్లించాలని, ఇకపై ప్రతి నెలా 5వతేదీ లోగా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏశాఖలో లేని విధంగా 108 ఉద్యోగులు రెండు షిఫ్టులలో షిఫ్టుకు 12 గంటల చొప్పన తీవ్ర ఒత్తిడితో పనిచేయడం కారణంగా చాలా మంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. కావున తమకు పని ఒత్తిడి తగ్గించి 108 ఉద్యోగులకు కూడా మూడు షిఫ్టులు 8 గంటల చొప్పున పనివిధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.వెంకటరమణ, గోపాలం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు 350 మంది హాజరు


బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాలకు చెందిన 200 మంది బాలురు, 150 బాలికలు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది క్రీడాకారులు అండర్-14 విభాగంలో, అండర్-17 భాగంలో 10 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో కాకినాడలో జరగనున్న అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి నున్న సురేష్, పలువురు పీడీలు పర్యవేక్షించారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

- సబ్‌జైలు సూపరింటెండెంట్ సంపత్ రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్‌జైలు సూపరింటెండెంట్ సంపత్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సబ్‌జైలు సూపరింటెండెంట్ సంపత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హెచ్‌ఐవీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండవచ్చని హితవు పలికారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఐసీటీసీ సెంటర్లలో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తారని, వ్యాధి బారిన పడిన వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కె.గౌరి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి


అప్పల నరసింహరాజు మృతదేహం

మెంటాడ: మండల కేంద్రంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై సీతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం మండలంలోని కొణిశ గ్రామానికి చెందిన పి.అప్పల నరసింహ రాజు వ్యాపార నిమిత్తం గ్రామం నుంచి అగూరు గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మెంటాడ గ్రామం మధ్యలో ఉన్న మద్యం దుకాణం నుంచి రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు మరో బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అప్పలనరసింహరాజు అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే వేరే ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టిన రాజస్థాన్‌కు చెందిన వారికి గాయాలయ్యాయి. వారిని స్థానిక పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తృణధాన్యాలతో ఆరోగ్య సిరి

- కొండకోనల్లో విస్తరిస్తున్న మిల్లెట్స్ సాగు
- పోషక విలువలు గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- మిల్లెట్ పాలసీ కింద ప్రోత్సాహకాలు


తివ్వాకొండల్లో సాగు చేస్తున్న కొర్ర చేను

భామిని: కొండ ప్రాంతాల్లోని గిరిజనులు ఆకలి తీర్చుకోవడానికే సాగుచేసే గడ్డిజాతికి చెందిన తృణధాన్యాలలో విశేష గుణాలను గుర్తించిన ఆహార శాస్త్రవేత్తలు ప్రపంచానికి చిరుధాన్యాల ప్రాముఖ్యతను చాటిచెబుతున్నారు. చిరుధాన్యాలైన కొర్రలు,సామలు, గంటెలు, రాగులు, జొన్నలు, ఊదలు, ఆరెకల సాగుపై మక్కువ పెంచుతున్నారు.మనిషి ఆరోగ్యంగా ఉండడానికి చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయి. చిరుధాన్యాల సాగు వల్ల భూమి సారం పెరుగుతుంది. నీటి వినియోగం తక్కువగా ఉండి పర్యావరణానికి ఎలాంటి హానీ జరగదు.

పోషక విలువల గుర్తింపు

2023వ సంవత్సరాన్ని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించి చిరుధాన్యాల ప్రాముఖ్యతను చాటింది. వాటి ఉత్పత్తి పెంచడానికి ప్రోత్సహించింది. అతి తక్కువ పెట్టుబడితో పండించే మిల్లెట్స్‌తో అధిక ఆదాయం వచ్చే మార్గాలను పెంపొందించింది.

మిల్లెట్ పాలసీ..

పోషక గనులున్న చిరుధాన్యాల సాగుకు గత రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్ పాలసీ ప్రకటించింది. చిరుధాన్యాల సాగు పెంచేందుకు హెక్టారుకు రూ.6 వేల ప్రోత్సాహకం ప్రకటించి ప్రోత్సహించింది. సాగు విస్తీర్ణం పెంచడం, పండించిన చిరుధాన్యాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై దృష్టి సారించింది.

ప్రకృతి ప్రసాదం

తృణధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ఔషధ గుణాల సమ్మిళితమైన గిరిజనుల తిండి గింజలైన తృణధాన్యాలను ఆరోగ్య గుళికలుగా వర్ణిస్తారు.చిరుధాన్యాలను తింటూ ఆరు నెలల నుంచి రెండేళ్లలోపు ఎలాంటి వ్యాధులైనా నిర్మూలించుకోవచ్చని ప్రకృతి వైద్యులు చెబుతున్నారు. ఇవి రోగ కారకాలను శరీరం నుంచి తొలగించి దేహాన్ని శుద్ధి చేస్తాయి. తృణధాన్యాలలోని పీచు పదార్థం శరీరానికి రక్షణగా నిలుస్తుందని న్యూట్రిస్టులు చెబుతున్నారు.


మిశ్రమ పంటలతో సాగుతున్న మిల్లెట్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు


ఆరోగ్య ప్రదాతలైన చిరుధాన్యాల రకాలు

తృణ ధాన్యాలలో ప్రత్యేకతలు

కొర్రలు: నరాల శక్తి మానసిక దృఢత్వం పెరుగుదల, ఆర్థరైటిస్, మార్చరోగాల నుంచి విముక్తి.
అరికలు: రక్తశుద్ధి, రక్తహీనత, రోగ నిరోధక శక్తి, డయాబిటిస్, మలబద్ధకం నివారిస్తుంది.
ఊదలు: లివర్, కిడ్నీ, నిర్ణల గ్రంధులు, కొలెస్టరాల్, కామెర్లు తగ్గించడం.
సామలు: అండాశయం, వీర్యకణ సమస్యలు, పీసీఓడీ. సంతానలేమి సమస్యల నివారణకు పనిచేస్తుంది.
అండుకొర్రలు: జీర్ణాశయం,ఆర్థరైటిస్, బీపీ, థైరాయిడ్, కంటి సమస్యలు. ఊబకాయం నివారణకు సహకరిస్తుంది.

మిశ్రమ పద్ధతిలో విస్తారంగా సాగు

ఐటీడీఏ పరిధిలోని భామిని, సీతంపేట, వీరఘట్టం, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ మండలాల పరిధిలో సాగు విస్తరిస్తున్నాం. ఏపీపీఐ ఆర్థిక సహాయంతో సుమారు వెయ్యి ఆదివాసీ గిరిజన కుటుంబాలతో ఆధునిక సాగులో చిరుధాన్యాల సాగు చేయిస్తున్నాం. మరో 12 మండలాల్లో సాగు విస్తరించే ప్రణాళిక చేపడుతున్నాం.

– కల్యాణ్ పాత్రో,
జిల్లా ప్రోగ్రాం అధికారి, వాస్సన్ సంస్థ

పెరుగుతున్న విస్తీర్ణం..



పార్వతీపురం మన్యం జిల్లాలో మిల్లెట్స్ సాగు విస్తరిస్తున్నాం.ఇప్పటికే 3750 ఎకరాల్లో విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. దీన్ని మరింతగా పెంచడానికి చిరుధాన్యాల విత్తనబ్యాంక్‌లు సిద్ధం చేసి ప్రోత్సహిస్తూ ప్రకృతి సాగు పద్ధతుల్లో గిరిజన ప్రాంతాలతో పాటు పల్లం ప్రాంతాలకు విస్తరిస్తున్నాం, సేంద్రియ సాగు విధానాలను అందరు రైతులకు అలవాటు చేస్తున్నాం. అందుబాటులోని పురాతన చిరుధాన్యాల విత్తన బ్యాంకులు తయారు చేసి మిశ్రమ వ్యవసాయ పద్ధతులతో సాగు పెంచుతున్నాం. తృణధాన్యాల సాగు విస్తీర్ణం పెంచి ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను వినియోగంలోకి తెస్తున్నాం.


– పి.షణ్ముఖరాజు, డీపీఎం,
సేంద్రియ వ్యవసాయ నిర్వహణ సంస్థ,
పార్వతీపురం మన్యం జిల్లా

సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన


ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలియజేస్తున్న చిన్నయ్యపేట గ్రామస్తులు

రేగిడి: మండలంలోని చిన్నయ్యపేట గ్రామస్తులు సంకిలి ఈఐడీ సుగర్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. తమ గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఈ ఫ్యాక్టరీ వల్ల తాము, గ్రామం పూర్తిగా నష్టపోతున్నామని, పరిష్కార మార్గాలు చూపించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద నినాదాలు చేస్తూ పరిష్కార మార్గాలు చూపిస్తారా? ఫ్యాక్టరీ మూసేస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీ కారణంగా తమ గ్రామంలో తాగునీటి బోరు నీరు కలుషితమైందని, ఆ నీటిని తాగి చాలామంది అనారోగ్యం బారిన పడ్డారని వాపోయారు. ఫ్యాక్టరీ వల్ల వచ్చే దుమ్ము, ధూళి, మసి కారణంగా తమ గ్రామ ప్రజలు బయటకు రాలేకపోతున్నారని, కంటి సమస్యలతో సతమతమవుతున్నారని వాపోయారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలు నేరుగా గ్రామానికి చెందిన ఓట్‌చెరువు, పటేల్ చెరువు, నీలం చెరువుల్లో కలవడంతో వాటి ఆయకట్టులోని 30 ఎకరాల్లో ఎటువంటి పంటలు పండించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. ఫ్యాక్టరీ మెయిన్ గేట్ కిందనున్న కురామి చెరువులో ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వ్యర్థాలు పూర్తిగా కలవడంతో చెరువు మొత్తం పూడుకుపోయి కనుమరుగైందని వాపోయారు. ఫ్యాక్టరీ కారణంగా గ్రామంలోని ప్రజలతో పాటు మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయని, పరిష్కార చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లారీ డ్రైవర్ల వినూత్న నిరసన


అంతర్రాష్ట్ర రహదారిపై ఖాళీ ప్లేట్లతోనిరసన తెలియజేస్తున్న లారీ డ్రైవర్లు

కొమరాడ: జిల్లా కేంద్రం పార్వతీపురం నుంచి కూనేరు వరకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గోతుల మయం కావడంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరగా వాహనాలు ఎక్కడికక్కడ దిగబడిపోయాయి. ఈ మేరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మూడు రాష్ట్రాలకు అనుసంధానం కావడంతో లారీ డ్రైవర్లు తిండి లేక రహదారిపై పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వారంతా సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఖాళీ ప్లేట్లతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి బాగులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ రహదారిపై ప్రయాణం చేయడంతో తమ వాహనాలు మరమ్మతుల బారిన పడుతుండడమే కాకుండా, తాము కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం మాయమాటలు చెప్పకుండా రహదారి పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.